క్లుప్తంగా

పాత్రుడికి ఘన సత్కారం



పదవీ విరమణ పొందిన పాత్రుడిని సత్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ)లో సొసైటీ కార్మికుడిగా (సీఎల్‌డబ్ల్యూయూ సొసైటీ) పని చేసిన పాత్రుడు ఈ నెల 30న పదవీ విరమణ పొందడంతో ఆయన్ను సొసైటీ పాలక వర్గ ప్రతినిధులు,సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు.సొసైటీ అధ్యక్ష,కార్యదర్శులు ఎన్.వి.రమణ,నూనెల పైడిరాజులు శాలువ కప్పి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సర్వసిద్ధి శ్రీనివాసరావు,చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరాన్ని సందర్శించిన అఘోరాలు

మల్కాపురం: అఘోరాలు శుక్రవారం పారిశ్రామిక ప్రాంతంలో పర్యటించారు. శివనామస్మరణతో ఆధ్యాత్మిక భావం పెంపొందించారు. నలుగురు అఘోరాలు గుల్లపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. అర్చకుడు చంద్రశేఖర్‌తో నిత్యం జరిగే పూజా విధానం గురించి తెలుసుకున్నారు. ఆ సమయంలో సాయిబాబా దర్శనానికి వచ్చిన పలువురి భక్తుల జాతకాలు చెప్పారు.

నేడు కళంజియా సర్వసభ్య సమావేశం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని మరిడిమాంబ కల్యాణమండపం వద్ద శనివారం మల్కాపురం కళంజియా సమాఖ్య సమావేశం నిర్వహించనునట్టు సమాఖ్య కో ఆర్డినేటర్ సుభాషిణి తెలిపారు. సుమారు వెయ్యి మంది కళంజియా గ్రూప్ లీడర్లు సమావేశంలో పాల్గొంటారని ఆమె వివరించారు. గతేడాది తమ సంస్థ చేసే పనులు, ఈ ఏడాది చేపట్టబోయే పనులపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు.

కృష్ణకు పరామర్శ



కృష్ణ యోగ క్షేమాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య తండ్రి, వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు గులిగిందల కృష్ణను మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ పలువురు కార్పొరేటర్లతో కలిసి పరామర్శించారు. కృష్ణ ఇంటికి శుక్రవారం వెళ్లిన ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కృష్ణను పరామర్శించిన వారిలో పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్,ముర్రు వాణి,బల్ల లక్ష్మణరావు, గులిగిందల లావణ్య,నాయకులు దొడ్డి కిరణ్, పుర్రె సురేష్‌యాదవ్, దాడి సత్యనారాయణ,పీలా అనంత్, పూండి మల్లేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా యంత్రాంగం, జిల్లా ఉపాధి కార్యాలయం, కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. రెండు రోజుల పాటు జరిగే ఈ మేళాను ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ప్రారంభించారు. ఈ మేళాకు తొలిరోజు శుక్రవారం 1220 మంది అభ్యర్థులు హాజరయ్యారు. టెక్ మహీంద్ర, పాత్ర కంపెనీలో 328 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.1.67 లక్షలు నుంచి రూ.2.50 లక్షలు ప్యాకేజ్ ఉంటుంది. ఈ కార్యక్రమంలో టెక్ మహీంద్ర హెచ్‌ఆర్ గీతాంజలి, జేకేసీ కో–ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నడిచే దారేది?

గోపాలపట్నం: గోపాలపట్నం బంక్ ప్రాంతంలో వ్యాపారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి నడిచేందుకు వీల్లేకుండా చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించడం వల్ల పాదచారులు నరక యాతన పడుతున్నారు. చిన్ని చిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా జీవీఎంసీ, ట్రాఫిక్ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడంతో పరిస్థితి గాడి తప్పుతోంది. దుకాణదారులు ఫుట్‌పాత్ ఆక్రమించడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేంటని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతుండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కొబ్బరి బోండాల దుకాణాలు, పానీ పూరీ దుకాణాలు, ఫాస్ట్ ఫాడ్ దుకాణాలతో హైస్కూల్ నుంచి బెహరా ఆస్పత్రి వరకు దారిలేని విధంగా ఏర్పాటు చేశారు. కొందరు దుకాణాలు ఉన్నా ఫుట్‌పాత్‌లపైకి వచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఫుట్‌పాత్‌పై బిర్యానీ వ్యాపారం



గోపాలపట్నం హైస్కూల్ విదార్థులు వెళ్లే దారిలో దుస్థితి



గోపాలపట్నం బంక్ సెంటర్‌లో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణం

వెంకటాపురంలో పర్యటించిన ఎమ్మెల్యే

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో ఎమ్మెల్యే గణబాబు శుక్రవారం పర్యటించారు. ఆయన స్థానికంగా ఉన్న సమస్యలపై ఆరా తీశారు. వెంకటాపురం వెంకటాద్రినగర్, వెంకటాపురం శ్మశాన వాటిక ప్రాంతాల్లో జీవీఎంసీ అధికారులు, రెవెన్యూ అధికారులతో పర్యటించారు. వెంకటాపురం నుంచి పద్మనాభనగర్ వెళ్లే దారిలో ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను తొలగించి కొత్త ట్యాంక్‌ను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. వెంకటాపురం ప్రాంతంలో యూజీడీ, డ్రైనేజీలు రహదారులు నిర్మించాలని ఆదేశించారు. వెంకటాపురం శ్మశాన వాటికకు తక్షణమే సర్వే నిర్వహించి ప్రహరీ నిర్మించాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమావతి, ఇంజినీరింగ్ అధికారులు,రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కాల్వల పరిస్థితిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విపత్తులు ఎదుర్కోవడంపై మాక్ డ్రిల్

మల్కాపురం: ఏవైనా ప్రమాదాలు జరిగితే ఎలా తప్పించుకోవాలి.. ఆపదలో ఉన్న వారిని ఎలా రక్షించాలి అన్న దానిపై కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ (వైజాగ్ యూనిట్)ఆధ్వర్యంలో పిలకవానిపాలెంలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్ అధికారులు, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సహకారంతో కార్యక్రమంలో చేపట్టారు. జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంఖర రెడ్డి,డెవలప్‌మెంట్ ఆఫీసర్ హుస్సేన్ ప్రమాదాలు జరిగితే ప్రజలు ఎలా అప్రమత్తం కావాలో అవగాహన కల్పించారు. సిబ్బంది చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కోరమాండల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న కోరమాండల్ అధికారులు

'జీవో 429ని అమలు చేయండి'

సీతమ్మధార: జీవో నంబర్ 429ని అమలు చేయాలని కోరుతూ ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ప్రతినిధులు శుక్రవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును కలిశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఫౌండర్ ప్రెసిడెంట్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం జోషి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స అందిస్తూ, ప్రభుత్వ నిబంధనలు అనుసరిస్తూ 50 ఏళ్లుగా ప్రజల్లో పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. నాటి ప్రభుత్వం 2008లో జీవో నంబర్ 429ని ఇచ్చి తద్వారా గుర్తింపునిస్తూ ప్రభుత్వ అనుమతులలో శిక్షణ ఇచ్చారని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రాల్లో సుమారు 95 వేల మందికి శిక్షణ ఇచ్చారని, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆ జీవోని అమలు పరచడంలో విఫలమయ్యాయన్నారు. రాష్ట్రంలో 46 వేల కుటుంబాలు ఉన్నాయని, తమకు న్యాయం జరిగేలా కృషి చేయాలని ఎమ్మెల్యేను గ్రామీణ వైద్యులు కోరారు.

రైతు బజార్లలో పార్కింగ్ టెండర్ గడువు పెంపు

మహారాణిపేట: కంచరపాలెం, గోపాలపట్నం రైతు బజార్లలో ఖాళీ స్థలంలో పార్కింగ్ కోసం ఏడాది కాలానికి బహిరంగ వేలం నిర్వహణకు ఇచ్చిన గడువును పెంచారు. జులై ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ వరకు పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వేలం కోసం తొలుత ఈనెల 28వ తేదీ(శుక్రవారం) నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ కారణాల వల్ల ఈ గడువును జులై 5వ తేదీ వరకు పొడిగించారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు ధరావత్తు సొమ్మును జిల్లా జాయింట్ కలెక్టర్, రైతు బజార్లు, విశాఖపట్నం వారి పేరున డీడీని జత చేసి దరఖాస్తులను పంపాలని జిల్లా ఇన్‌జార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను శనివారం నుంచి వచ్చేనెల 5వతేదీ మధ్యాహ్నం ఒంటి గంటలలోపు అందజేయాలని, 5న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, బేస్ రేట్లు కూడా ఇవ్వడం జరిగిందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తులు, ఇతర ఫారాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్.నంబరు 8.202/2, ఆర్‌ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, రైతుబజార్ పక్కన, విశాఖపట్నం -530029ను సంప్రదించాలి. లేదా ఫోన్ 9030819082కు సంప్రదించాలి.

వైభవోపేతం.. భువన విజయం

సీతంపేట: శ్రీకృష్ణదేవ రాయలు కాలంలో అష్టదిగ్గజాలతో భువన విజయం సభ నిర్వహించేవారని పుస్తకాల్లో చదివాం, సినిమాలలో చూసి ఉంటాం. కానీ అప్పటి రాయల వారి వైభవం, ఆహార్యం, కవుల సాహితీ ప్రతిభ, చమత్కారం చూసే భాగ్యం మనకు లేదనే చెప్పాలి. శ్రీలలితాపీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాలలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన అక్కిరాజు సుందర రామకృష్ణంరాజు బృందం ప్రదర్శించిన 'భువన విజయం సాహితీ రూపకం' అప్పటి వైభవాన్ని ప్రేక్షకుల కళ్లకు కట్టినట్టు చూపారు. సభికులను శ్రీకృష్ణదేవరాయల కాలానికి తీసుకువెళ్లేలా రసాస్వాదనకు లోనుచేశారు.డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణరాజు ప్రధాన పాత్రలో శ్రీకృష్ణ దేవ రాయలుగా అద్భుతమైన రాజసం, ఆహార్యంతో ఆకట్టుకున్నారు. అలాగే అప్పాజీగా ముదిగొండ శివప్రసాద్, అల్లసాని పెద్దనగా పంద్రప్రగడ శ్రీనివాస్, మల్లనగా భాస్కరభట్ల, అయ్యలరాజుగా కె.చంద్రశేఖరం, పింగళిసూరనగా చౌదూరి నరసింహారావు, నంది తిమ్మనగా మల్లాది వెంకట గోపాలకృష్ణ, ధూర్జటిగా యెల్లం రాజు త్యాగరాజు, భట్టుమూర్తిగా సి.యం.కె.గాంధీ, తెనాలి రామకృష్ణుడిగా మావుదూరు సూర్యనారాయణమూర్తి తమదైన శైలిలో అద్భుత ఆహార్యం, పద్యపఠనంతో అలరించారు. ఈ సందర్భంగా అక్కిరాజు సుందర రామకృష్ణ మాట్లాడుతూ మతసామరస్యాన్ని చక్కగా పాటించి ప్రజా సంక్షేమం కోసం సుపరిపాలన అందించిన ఏకైక చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయులు అని కొనియాడారు. ఆ మహా చక్రవర్తి సాధించిన విజయాలను పక్కనపెడితే భాషాపరంగా ఆయన చేసిన కృషి ఆనాటి నుంచి ఈ నాటి వరకు ఏ రాజు, ఏ ప్రభుత్వం చెయ్యలేదనే చెప్పాలన్నారు. అష్ట దిగ్గజ పాత్రధారులు తమదైన అద్భుత ప్రతిభతో దత్తపది, సమస్య పూరణ, వర్ణనలతో సభను రక్తికట్టించారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన భువనవిజయం సాహితీ రూపకాన్ని పలువురు భక్తులు, సాహితీవేత్తలు చూసి తరించారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



భువన విజయం సాహితీ రూపకాన్ని తిలకిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి



హాజరైన భక్తులు, సాహితీప్రియులు

రక్తహీనతకు చెక్ పెడదాం

తగరపువలస: ఎనీమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం శుక్రవారం ఆనందపురం మండలంలో పర్యటించింది. బోయిపాలెం, చందక, గంభీరం పంచాయతీల్లో వైద్యశాఖ, ఐసీడీఎస్ శాఖల పనితీరును పరిశీలించిన తరువాత బోయిపాలెం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థునులతో మాట్లాడుతూ రక్తహీనతను నివారించే మాత్రలు ప్రతి శుక్రవారం ఇస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. హిమోగ్లోబిన్ పరీక్షల రికార్డులను పరిశీలించారు. గంభీరం, చందకలలో ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లను పరిశీలించి గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికల్లో రక్తహీనతకు తీసుకుంటున్న చర్యలు తెలుసుకున్నారు. ఈ బృందంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ కేంద్ర కార్యాలయ అధికారి డాక్టర్ ఎస్.పూజిత, ఎనీమియా ముక్తి భారత్ జిల్లా ప్రోగ్రాం అధికారి సమత, డాక్టర్ హీనా దీక్షిత్, ఆనందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి గంగునాయుడు, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ అధికారి మనోరమ, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఐసీడీఎస్ భీమిలి పీవో మామిడి శ్రీదేవి, పర్యవేక్షకురాలు రత్నం, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



గంభీరం వెల్‌నెస్ సెంటర్‌లో మాత్రలను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

యునిసెఫ్ సమ్మిట్‌కు ఓక్రిడ్జ్ విద్యార్థుల హాజరు



హ్యూస్టన్ సమ్మిట్‌లో పాల్గొన్న ఓక్రిడ్జ్ విద్యార్థులు

తగరపువలస: ఇటీవల హ్యూస్టన్‌లో జరిగిన యునిసెఫ్ సమ్మిట్ ఎన్‌ఏఈలో భీమిలి మండలం శింగనబంధ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యమైన సమస్యలు చర్చించి పరిష్కారాలు సాధించడానికి జరిగిన ఈ సమ్మిట్‌లో ఓక్రిడ్జ్‌కు చెందిన ఎస్.సూర్యతేజ్, వి.ఆన్యా, బి.సృజన్ పాల్గొన్నారు. సమ్మిట్‌లో అద్భుతమైన నాయకత్వం, పట్టుదల ప్రదర్శించారని స్కూల్ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. విద్యతో మొదలుకుని పర్యావరణ మార్పుల వరకు వివిధ అంశాలపై విద్యార్థులు లోతైన చర్చల్లో పాల్గొన్నారని పేర్కొంది. ఈ సమ్మిట్‌లో నార్త్ ఆంగ్లియాకు చెందిన 120 కంటే ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆరు రోజుల పాటు జరిగిన సమ్మిట్‌లో పాల్గొన్న విద్యార్థులను ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల అభినందించారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూరులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



మల్లెపూలు, గులాబీల అలంకరణలో అమ్మవారు



క్షీరాభిషేక సేవలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు

అల్లిపురం : బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయదాతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని మల్లెలతో అభిషేకించారు. ప్రతి శుక్రవారం జరిగే ఈ పూజలో పాల్గొనే వారు రూ.500 చెల్లించిన యెడల ఈ పూజకు దంపతులను లేక ఇద్దరిని అనుమతిస్తామని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వి.రాంబాబు తెలిపారు. ఆసక్తి గల వారు 0891–2566514, 8985515989 నంబర్లు, వాట్సాప్ ద్వారా సేవా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..
కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

వెల్ఫేర్ బోర్డు పథకాలు కొనసాగించాలి

సీఐటీయూ డిమాండ్

అల్లిపురం : భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికు ల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కరోనా సమయంలో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడినప్పుడు వెల్ఫేర్ బోర్డు ద్వారా ఎటువంటి సాయం అందలేదన్నారు. వెల్ఫేర్ బోర్డులో వున్న సొమ్మును కార్మికుల సంక్షేమానికి ఖర్చు పెట్టలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.అనసూయ, పూర్వ ప్రధాన కార్యదర్శి జి.పోలేశ్వరరావు, కె.నర్సింగరావు, రమణ, లక్ష్మణ, రాజు, చంద్రరావు, సూరప్పడు అన్ని జోన్ల కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ జిల్లా అధ్యక్షురాలు అనసూయ

విద్యుత్ షాక్‌తో హెల్పర్ మృతి



శంకరరావు(ఫైల్)

గోపాలపట్నం: గోపాలపట్నంలోని ఓ ఆస్పత్రి వద్ద విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న సమయంలో.. కరెంట్ షాక్‌కు గురై హెల్పర్ సిరపురపు శంకరరావు(51) మృతి చెందాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. సింహాచలం సాయినగర్‌కు చెందిన సిరపురపు శంకరరావు లైన్‌మన్ వద్ద హెల్పర్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ఆస్పత్రి వద్ద విద్యుత్ సమస్య ఉండడంతో.. స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. ఆ సమయంలో విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందకు పడిపోవడంతో తీవ్రంగా దెబ్బలు తగిలాయి. వెంటనే అతన్ని బెహరా ఆస్పత్రిలో చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. శుక్రవారం తెల్లవారుముజామున ఆయన మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.